క్లుప్తంగా

బస్సును ఢీకొట్టిన లారీ

దమ్మపేట: అతివేగంగా వస్తున్న లారీ, బస్సును ఢీకొట్టగా మహిళ చెయ్యి తెగిన ఘటన మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బస్సు డ్రైవర్, ప్రయాణికుల కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఏపీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులో.. అదే పట్టణానికి చెందిన కె.అనూష(25) మంగళవారం రాత్రి హైదారాబాద్‌కు బయలుదేరింది. ఈ బస్సు దమ్మపేట మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులోని మూలమలుపు వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో ఎదురుగా అతివేగంతో వస్తున్న లారీ, బస్సును కుడి పక్కన వెనుక భాగంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక భాగంలో కుడిపక్కన కూర్చున్న మహిళ మోచేతి నుంచి కింది భాగం నుజ్జునుజ్జయ్యి, తెగిపోయింది. గమనించిన డ్రైవర్, తోటి ప్రయాణీకులు వెంటనే 108కు సమాచారం అందించగా, క్షతగాత్రురాలిని అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుట్కాలు అమ్మితే చర్యలు

మణుగూరురూరల్: నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఆయన తన సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు పాన్‌షాప్, కిరాణా దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుట్కాలను నిషేధిస్తూ ప్రకటన చేసిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా గుట్కా ప్యాకెట్లను అమ్మినా, కొనుగోలు చేసినా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా గుట్కాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి

కరకగూడెం: గత కొద్దిరోజులుగా మండలంలోని గుడుంబా స్థావరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున కరకగూడెం ఎస్సై రాజేందర్ తన సిబ్బందితో మండల పరిధిలోని కలవలనాగరం, కొలుర్ గ్రామాల మధ్యగల అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై విశ్వసనీయ సమాచారంతో దాడి చేశారు. ఈ సందర్భంగా నాటు సారాకు అవసరమైన సుమారు 500 వందల లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నిషేధిత నాటు సారాను ఎవరైనా తయారుచేసిన, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీమా చెక్కు అందజేత

దమ్మపేట: బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పార్టీ తరపున ప్రమాద బీమా చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని రెడ్యాలపాడు గ్రామానికి చెందిన పాకలపాటి భాస్కరరావు అనే బీఆర్ఎస్ కార్యకర్త, గత కొద్ది నెలల కిందట జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులకు, పార్టీ తరపున రెండు లక్షల రూపాయల విలువైన ప్రమాద బీమా చెక్కును, మాజీ ఎమ్మెల్యే మెచ్చా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఎల్లప్పుడు కుటుంబానికి అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో గోపాలరావు, శ్రీను, చంటి, ఓబులు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుపై సంబరాలు

అశ్వారావుపేటరూరల్: ఏపీ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందడం పట్ల మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. మంగళవారం స్థానిక రింగ్ రోడ్ సెంటర్, మండలంలోని నారంవారిగూడెం గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, కేక్ కట్ చేశారు. అలాగే టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు మూయబోయిన ఉమాదేవి, కురిశెట్టి నాగబాబు, డేగల రాము, కట్రం స్వామి, నార్లపాటి శ్రీను, బ్రహ్మం, వినోద్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: ఆంధ్రాలో కూటమి విజయం సాధించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ శ్రేణులు సంబరాలు చేశారు. జగన్నాథపురంలో ర్యాలీ చేశారు, ప్రధాన సెంటర్లో కేక్ కట్ చేశారు. అడపా నాగేశ్వరరావు, తన్నీరు చిన్నపుల్లయ్య, తోట పావన్, కోమాళ్ల దుర్గాప్రసాద్, లగడపాటి భాస్కర్, చిన్నబ్బాయి, ప్రగఢ సత్తిబాబు, అశోక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

దమ్మపేట: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి, వైద్యం నిమిత్తం ఎల్ఓసీ పత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని నాగుపల్లి గ్రామానికి చెందిన వడ్లాన పు రామానుజనమ్మ, అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. ఆమెకు చికిత్స నిమిత్తం ఐదు లక్షల రూపాయలు అవసరమని తెలుసుకున్న ఎమ్మెల్యే, ఎల్ఓసీ పత్రాన్ని నాగుపల్లి గ్రామంలో ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడైనా పూర్తయ్యేనా..?

- నత్తనడకన క్రీడామైదాన నిర్మాణ పనులు
- ఏడాది క్రితమే ప్రారంభం.. నేటికీ అసంపూర్తిగానే
- సమీపిస్తున్న వర్షాకాలం



మెటల్ పోసి వదిలేసిన ట్రాక్



90 శాతం పూర్తయిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు

దుమ్ముగూడెం: ఏజెన్సీలోని యువతి, యువకులలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు, వారు సాధన చేసేందుకు మంచి క్రీడామైదానం లేదని గుర్తించిన జిల్లా అధికారయంత్రాంగం క్రీడామైదానం ఏర్పాటుకు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పక్కన ఉన్న ప్రభుత్వ భూమి 8ఎకరాల 27 గుంటలను కేటాయించింది. ప్రభుత్వం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నక్సల్స్ ప్రభావిత అభివృద్ధి నిధులు రూ.2.27 కోట్లను క్రీడామైదానం నిర్మాణానికి మంజూరు చేసింది. కాగా పనులను దక్కించుకున్న గుత్తేదారులు పనులను నత్తనడకన సాగిస్తుండటంతో క్రీడామైదాన నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తి అవుతాయే అని మండల యువత వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. గతేడాది పనులు ప్రారంభం కాగ ఏడాది పూర్తి కావస్తున్నప్పటికీ ఇంకా పనులు పూర్తికాక పోవడం గుత్తేదారుడి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు 90 శాతం పనులు కాగా మైదాన నిర్మాణ పనులు (50శాతం) మెటల్ పోసి వదిలేసి దాదాపు కొన్ని నెలలు గడుస్తోంది. మరి కొన్ని రోజులలో వర్షాకాలం ప్రారంభం కానుండటంతో ఈ ఏడాదికి క్రీడామైదాన పనులు పూర్తికావనే ఆలోచనలో యువత ఉన్నారు.

తప్పని ఎదురుచూపులు..

మండలంలో క్రీడామైదానం నిర్మాణం పూర్తయితే మండలంలోని గ్రామీణ క్రీడాకారులకు ఎంతగానో మేలు జరగనుంది. క్రీడామైదానం పూర్తయితే జిల్లా స్థాయి పోటీలు ఇక్కడ నిర్వహించే అవకాశాలు ఉన్నాయని గతంలో జిల్లా అధికారులు సైతం ప్రకటించారు. మండలంలో ఎంతో మంది యువతి,యువకులు పలు క్రీడల్లో రాణిస్తూ జాతీయంగా అంతర్జాతీయంగా దుమ్ముగూడెం మండలానికి పేరు ప్రఖ్యాతలు తీసుకోస్తున్నారు. కాగా వారు సాధన చేసేందుకు అనువైన క్రీడామైదానం లేక పోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మైదాన నిర్మాణం పూర్తయితే వారి కష్టాలు ఇక తీరినట్టే అనుకున్నారు. కానీ గుత్తేదారుడి నిర్లక్ష్యంతో మైదాన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.స్థానికంగా అనువైన క్రీడామైదానం లేక క్రీడాకారులకు ఇన్నాళ్లూ తిప్పలు తప్పలేదు. ఆటలో ప్రతిభ, నైపుణ్యం ఉన్న క్రీడాకారులు సాధన చేయడానికి సరైన మైదానాలు లేవు. గ్రామీణ క్రీడలు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ ఆడే వీరు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మైదానం లేక జిల్లా కేంద్రాలలో,డివిజన్ కేంద్రాలలో సాధన చేస్తున్నారు. నిర్మాణం పూర్తయితే క్రీడాకారులకు ఇబ్బందులు తొలగనున్నాయి దీంతో క్రీడాకారులు ఎదురుచూపులు చూస్తున్నారు.

వచ్చేది వర్షాకాలం..

మరో కొన్ని రోజులలో వర్షాకాలం ప్రారంభంకానుంది. క్రీడామైదానం నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది కానీ గ్రౌండ్ నిర్మాణ పనులు ఆగిపోయి నెలలు గడుస్తున్నాయి. వచ్చేది వర్షాకాలం కావడంతో ఈ ఏడాది క్రీడామైదానం పూర్తయ్యే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. నిధుల విడుదల జాప్యంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకుని క్రీడామైదాన నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.



ఇంకెంతకాలం..?



మండలంలోని క్రీడాకారుల కోసం పోలీస్, ఐటీడీఏల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న క్రీడామైదాన పనులు ఇంకెంతకాలం సాగుతాయి? క్రీడామైదానం ఎప్పుడు ఏర్పాటు అవుతుందో అనే ఆశతో మండలంలోని క్రీడాకారులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

– కల్లూరి శంకర్, క్రీడాకారుడు

కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం..



క్రీడామైదానం నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నప్పటికీ పెడచెవిన పెట్టి పనులు సాగించడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లాం. మరోసారి తీసుకుని వెళ్లి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏఈ

ఆదరించిన ఓటర్లకు కృతజ్ఞతలు



మణుగూరుటౌన్: బలరాం నాయక్‌తో ఎమ్మెల్యేలు, నాయకులు

మణుగూరుటౌన్: కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం కష్టపడ్డ వారందరికీ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ధన్యవాదాలు తెలిపారు. చరవాణి ద్వారా మాట్లాడిన ఆయన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించి బలరాం నాయక్‌కు పినపాక నియోజకవర్గం నుంచి 50వేల ఓట్ల మెజార్టీని అందించి ప్రత్యర్థులను దరిదాపుల్లో లేకుండా చేసిన మిత్రపక్షాలకు, కార్యకర్తలకు, అభిమానులకు, బూత్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులకు, పినపాక నియోకవర్గ ప్రజలకు ఆయన ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద ఎంపీ బలరాం నాయక్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

చర్ల: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి అత్యధిక మెజారిటీ పోరిక బలరాంనాయక్ గెలుపొందడం పట్ల టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రాచలం శాసన సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన బలరాంనాయక్‌ను గెలిపించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో కాంగ్రెస్ గాలి బలంగా వీచిందని అన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ కేంద్రంపై పెద్ద ఎత్తున ఉద్యమాలను సాగిస్తుందని ఆయన అన్నారు.

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసిన రామసహాయం రఘురాం రెడ్డిను భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ ఎన్నికలో అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతోపాటు, మిత్రపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ, ఎన్డీ, టీడీపీ పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు చెప్పారు. నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థికు అత్యధిక మెజార్టీ ఇవ్వడంపై ఆయన సంతోషం వ్యక్తం చేసి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని పేర్కొన్నారు.

'పేట'లో కాంగ్రెస్ ప్రభంజనం

అశ్వారావుపేట: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట ఎమ్మెల్యేగా గెలిచిన జారే ఆదినారాయణ నాడు 28,905 ఓట్ల ఆధిక్యం సాధించగా.. ప్రస్తుతం ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డికి అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు 76,116 ఓట్లు ఇచ్చారు. సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కంటే 42,927 ఓట్లతో సరిపెట్టుకున్నారు. దాదాపు రెట్టింపు స్థాయి మెజారిటీ అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచి 14రౌండ్లలో ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థికే ఆధిక్యం లభించింది. ఇదే తరహాలో అసెంబ్లీ ఫలితాల్లో కూడా అశ్వారావుపేట కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణకూ ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం లభించింది. అసెంబ్లీ ఫలితాల కంటే పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో ఎంపీ అభ్యర్థికి అధిక మెజారిటీ లభించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని కలిగించింది.

పినపాక నియోజకవర్గంలో..

బూర్గంపాడు: మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రికార్డు స్థాయి మెజారిటీతో దూసుకుపోయింది. పినపాక నియోజకవర్గంలోని 2,03,790 ఓట్లకుగాను 1,39,794 ఓట్లు పోలయ్యాయి. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్‌నాయక్ 49వేల పైచిలుకు ఓట్లు మెజారిటీ సాధించారు. ఆయనకు 77,121 ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు 27,994 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారామ్ నాయక్ 15,098 ఓట్లు సాధించారు.

పల్లె ప్రకృతి వనాలపై పట్టింపేది?



వెంకటాపురం పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

అశ్వాపురం: మండలంలో 24 గ్రామ పంచాయతీలలో గత ప్రభుత్వంలో పంచాయతీ పాలకవర్గాల ఆధ్వర్యంలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పాలకవర్గాల పదవి కాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడంతో పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండి పోయి ఎండిన మొక్కలు దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసి పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో మొక్కలు లేక వెలవెలబోతున్నాయి.

బీజేపీ సంబురాలు

మణుగూరురూరల్: కేంద్రంలో బీజేపీ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రాబోతుండడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల బీజేపీ నాయకులు మంగళవారం రంగులు చల్లుకుంటూ బాణా సంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్లే విజయం సాధించామన్నారు. పార్టీ గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు, ఓటేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అభినందన

అశ్వాపురం: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి భారీ మెజార్టీతో గెలిచేందుకు కొత్తగూడెం నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా కృషి చేసిన డీసీసీబీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్యను మంగళవారం ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు.

పిల్లలను చదువులో ప్రోత్సహించాలి



బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న సీడీపీఓ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు

మణుగూరుటౌన్: చిన్నతనం నుంచే పిల్లలకు చదువుపై ఎక్కువ శ్రద్ధ చూసే విధంగా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కూనవరం పంచాయతీలో అంగన్‌వాడీ టీచర్ లీలావతి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. మంచి అలవాట్లను పిల్లలకు నేర్పిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరే విధంగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని గుర్తు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పెట్టే పౌష్టికాహారాన్ని పిల్లలకు అందిస్తూ పిల్లలు ఆరోగ్యంగా ఉండేవిధంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా పుల్లమ్మ, పిల్లల తల్లిదండ్రులు లావణ్య, మౌనిక, షన్ను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



మణుగూరుటౌన్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకుల సంబురాలు..



దమ్మపేటలో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు



అశ్వారావుపేటరూరల్: ఊట్లపల్లిలో స్వీట్లు తినిపించుకుంటున్న పార్టీ కార్యకర్తలు

దమ్మపేట: ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి భారీ మెజార్టీతో గెలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మండల కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఆనందోత్సాహాలతో కాంగ్రెస్ యువత భారీగా బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పగడాల రాంబాబు, చక్కిరాల మల్లేశ్వరరావు, చిన్నశెట్టి కోటయ్య, పగడాల కృష్ణ, గట్ల సర్వేశ్వరరావు, చిన్నశెట్టి గోపి, రామకృష్ణ, చారి, ముక్తేశ్వరరావు, సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌పార్టీ ఘన విజయం సాధించటంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు తినిపించుకుని టపాసులు కాల్చారు.గ్రామాలలో యువకులు బైక్‌లతో ర్యాలీలు నిర్వహించారు.

మణుగూరుటౌన్: మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిపోరిక బలరాం నాయక్ గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రమైన మణుగూరులో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షించే పార్టీ అని, ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ విజయాన్ని కాంక్షించిన వారికి మిత్రపక్షాలకు, యూత్ కాంగ్రెస్ నాయకులకు, బూత్ ఇన్‌చార్జ్‌లకు, మణుగూరు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. బాణసంచా పేల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో శివ సైదులు, ఐఎన్‌టీయూసీ నాయకులు కృష్ణంరాజు, వూకంటి ప్రభాకర్‌రావు, గాండ్ల సురేశ్, ఆవుల సర్వేశ్వరరావు, త్రిమూర్తులు, గాండ్ల సురేశ్ తదితరులు ఉన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా రఘురాంరెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం మండలంలోని నారంవారిగూడెం, ఊట్లపల్లి, అశ్వారావుపేట తోపాటు పలు గ్రామాల్లో పార్టీ నాయకులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు. అలాగే పార్టీ నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, చిన్నంశెట్టి సత్యనారాయణ, సంద్రు రమేష్‌తోపాటు పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శంకర్‌బాబు, సత్యం రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అశ్వాపురం: మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ 3,49,165 ఓట్ల మెజార్టీతో గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట సంబరాలు జరుపుకున్నారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారంగా ప్రైవేటు విద్య

- త్వరలోనే మోగనున్న బడి గంటలు
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల మోత
- సతమతమవుతున్న తల్లిదండ్రులు



మణుగూరురూరల్: ఖర్చుల మాసంగా జూన్ అందరికీ దడ పుట్టిస్తోంది. జూన్ మాసం ఆరంభమైందంటే పిల్లల తల్లిదండ్రులందరికి కలవరమే. విద్యాసంవత్సరం ప్రారంభం జూన్‌తోనే కానుండడంతో మరో ఆరు రోజుల్లో బడి గంటలు మోగనున్నాయి. తమ పిల్లలకు మంచి విద్యను అందించాలనే తల్లిదండ్రులు కలలు కంటుంటారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో తమ పిల్లలను చదివించే వారికి ఫీజుల మోతతో పాటు పుస్తకాలు, యూనిఫామ్, షూస్, ఇతర సామగ్రి ఖర్చులు భారంగా మారనున్నాయి. విద్యార్థుల తరగతులను బట్టి రూ. 10వేల నుంచి రూ50వేల వరకు ప్రతీ కుటుంబం భారం పడనుంది. ప్రతీ ఏటా జూన్ నెల అంటేనే ఖర్చుల మాసంగా తల్లిదండ్రులు కలవరపడుతుండడం పరిపాటే. ఇక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆ ఫీజులనే, ఈ ఫీజులను ఏటేటా ఎడా పెడా వసూళ్ళకు తెరలేపుతుంటారు. దీంతో ఖర్చుల భారంతో ప్రతీ విద్యార్థి కుటుంబం సతమవుతుంది. ఇక మధ్యతరగతి, సామాన్య కుటుంబాల పరిస్థితి ఉక్కిరి బిక్కిరిగానే ఉంటుంది. పిల్లల విద్యా భవిష్యత్తు కోసం ఆర్థిక స్థోమత లేకున్నా తల్లిదండ్రులు అప్పులు చేయడానికి సైతం వెనుకాడడం లేదు. దీంతో అన్ని కుటుంబాల్లో ఖర్చులపై కలవరం ప్రారంభమైంది.

ఇదిలా ఉంటే పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫామ్‌లను విక్రయిస్తుండడంతో తల్లిదండ్రులకు మరింత భారం అవుతోంది. ప్రైవేట్‌లలో ఫీజుల నియంత్రణ మాటలకే పరిమితం అవుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కుతూ విద్యావ్యాపారాన్ని జోరుగా కొనసాగిస్తున్నా.. సంబంధిత విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధిక ఫీజుల నియంత్రణపై విద్యార్థి సంఘాలు సైతం ఆందోళనలు చేపట్టినా, సంబంధిత అధికారులకు విన్నవించినా.. వారిలో చలనం కలగడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాను రాను ప్రైవేట్ విద్య విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక భారం పడనుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

అరకొరగా సౌకర్యాలు..

మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అరకొర సౌకర్యాల నడుమే విద్యాబోధన జరుగుతోంది. పలు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో చూపడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. తమ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై గొప్పలు చెప్పుకుంటూ ప్రచారం చేసుకుంటున్న యాజమాన్యాలు.. విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో విఫలం చెందుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. పిల్లలు స్కూల్‌లో జాయిన్ దగ్గర నుంచి మొదలుకొని పెన్సిళ్లు, పెన్నులతో వదలకుండా వ్యాన్ ఫీజ్ వరకు యాజమాన్యాలు తమ విద్యా వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించి, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సి అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఈ విషయంపై సంబంధిత మండల విద్యాశాఖ అధికారిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.